సాక్షి ఒడిశా

ఆదివారం । 15 । జనవరి । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయంలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన హుండీ ఆదాయాన్ని ఆలయ పాలకవర్గం శనివారం లెక్కించారు. ఇందులో నగదు రూ.5.92.013లు, బంగారం 4.4 గ్రాములు వచ్చాయని అధికారులు వెల్లడించారు.



అంబరాన్నంటిన సంబరాలు

- 4లో



గిరిజనుల ఆందోళన

కొరాపుట్: భారతమాల రోడ్డు నిర్మాణ తీరుపై గిరిజనులు ఆందోళనకు దిగారు. రోడ్డు నిర్మాణంలో నిబంధనలు పాటించడం లేదంటూ నవరంగ్‌పూర్ జిల్లా రాయిఘర్ సమితి దేవగాం గ్రామం వద్ద శనివారం రస్తారోకో చేపట్టారు.

న్యూస్‌రీల్

భక్తిశ్రద్ధలతో గోదాదేవి కల్యాణం



ఆలయంలో గోదాదేవికి కల్యాణం నిర్వహిస్తున్న భక్తులు

పర్లాకిమిడి: పట్టణంలోని కోమటి వీధిలో ఉన్న వేంకటేశ్వర దేవాలయంలో భోగి సందర్భంగా ప్రత్యేక మంగళ హారతులతో పాటు రంగనాథస్వామి, గోదాదేవి కల్యాణాన్ని శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ధనుర్మాసం నేపథ్యంలో గత నెల రోజులుగా తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో భద్రం శ్రీనివాసాచార్యులు జరిపిన తిరుప్పావై ప్రవచనాలు ముగిశాయి. ఇందులో భాగంగా గోదాదేవి కల్యాణం జరిపించారు. కొంచాడ సప్తగిరి, స్వప్న దంపతులు, కొంచాడ ప్రవీణ్, స్వాతీ, వెర్నాగుల కాళీప్రసాద్, అరుణ, కె.విశ్వేశ్వరరావు, దేవీమాధవ్, కె.హరిస్వరూప్ దంపతులు పూజల్లో పాల్గొన్నారు. అనంతరం మంగళ హారతులిచ్చి భక్తులకు ప్రసాదాలు పంచిపెట్టారు.

వాహనదారులకు అవగాహన



వాహనదారులకు కరపత్రాలు అందిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

బరంపురం: నగరంలోని ఇంజినీరింగ్ స్కూల్ రోడ్డు జంక్షన్‌లో ట్రాఫిక్ నిబంధనలపై ట్రాఫిక్ పోలీసులు వాహనదారులకు శనివారం అవగాహన కల్పించారు. ట్రాఫిక్ డీఎస్పీ ఆధ్వర్యంలో అతివేగం డ్రైవింగ్ ప్రమాదకరమని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని, తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, నిబంధనలు పాటిస్తూ అమూల్య జీవితాన్ని రక్షించుకోవాలని సూచిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. మద్యం సేవించిన వాహనాలు నడిపే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

అలేఖ్‌బాబాతో సమావేశమైన ఎంపీ రమేష్



అలేఖ్ శ్యాం సమాధి వద్ద నివాళులర్పిస్తున్న నవరంగ్‌పూర్ ఎంపీ రమేష్‌మాఝి

కొరాపుట్: అలేఖ్ మత గురువులతో నవరంగ్‌పూర్ పార్లమెంట్ సభ్యుడు రమేష్‌చంద్ర మాఝి సమావేశమయ్యారు. నవరంగ్‌పూర్ జిల్లా ఉమ్మర్ సమితి కొప్పెన పంచాయతీ ఒటముండా గ్రామంలో అలేఖ్ మహిమా ఆశ్రమాన్ని శనివారం సందర్శించారు. అక్కడక్కడ సమస్యలు, వసతులపై చర్చలు జరిపారు. తన కోటా నిధులతో అభివృద్ధి పనులు చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ఇటీవల తుదిశ్వాస విడిచిన అలేఖ్ బాబా శ్యామ్‌సుందర్‌కు నివాళులర్పించి, సమాధిపై బియ్యం వెదజల్లారు.

పర్లాకిమిడిలో భక్తి పుష్పాంజలి



మకర ఉత్సవంలో ఒడిస్సీ నృత్యాన్ని ప్రదర్శిస్తున్న బాలికలు

పర్లాకిమిడి: బలి చక్రవర్తిని మహావిష్ణువు పాతాలం లోకి తొక్కే రోజే సంక్రాంతి. సూర్యభగవానుడు దక్షిణాయణం ఉపాసన కాలం నుంచి ఉత్తరాయణం లోకి ప్రవేశించడం పుణ్యకాలమని, మకరంలో రవి ప్రవేశించే కాలాన్ని మకర సంక్రాంతి అంటారని దేవిమఠం మహంత రామానంద దాస్ తెలిపారు. పట్టణంలోని జగన్నాథ మందిరం ప్రాంగణంలో భక్తి పుష్పాంజలి సాంస్కృతిక సంస్థ ద్వారా మకర ఉత్సవాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఇందులో పురపాలక అధ్యక్షురాలు నిర్మలాశెఠి, లోకనాథ మిశ్రా అతిధిలుగా హాజరయ్యారు. కైలాష్ పట్నాయక్, అనంతరం కవి, విశ్రాంత ఉపాధ్యాయులు నర్సింగ గౌడో, సంపాదకులు, ఒడిశా సాహిత్య నాట్య అకాడమీ ద్వారా సన్మానం పొందిన ఆదర్శదాస్, సమాజిక కార్యకర్త మనోజ్ బెహరా, బింద్యుప్యా బెహరా లకు మెమొంటో, దుశ్శాలువతో సత్కరించారు.



పర్లాకిమిడి: టైలర్ వీధిలో భోగి మంట వద్ద తెలుగువారు



భువనేశ్వర్: ఏసీఏ ఆవరణలో తెలుగింటి ఆడపడుచుల ముగ్గుల ముచ్చట

తెలుగింట.. భోగిమంట



భువనేశ్వర్: తెలుగు సౌరభం సారథ్యంలో ఖుర్దారోడ్‌లో తెలుగు కుటుంబాలు

తెలుగింటి వారి పెద్ద పండగ సంక్రాంతిలో భాగంగా ప్రధాన ఘట్టం భోగి పర్వదినాన్ని ఒడిశా లోని తెలుగువారు శనివారం ఉత్సాహంగా జరుపుకొన్నారు. చిన్నా.. పెద్దా తారతమ్యం లేకుండా తెల్లవారుజాము నుంచే పోటాపోటీగా భోగి మంటలు వేసి సందడి చేశారు. పిల్లలు సంప్రదాయబద్ధంగా పిడకలను మంటల్లో వేసి, మురిసిపోయారు. పలు గ్రామాల్లో ముగ్గులు పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. గంగిరెద్దుల ఆటలు, హరిదాసుల పాటలతో పల్లెలు, పట్టణాల్లో ఉత్సాహభరిత వాతావరణం నెలకొంది. ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి.

– సాక్షి నెట్‌వర్క్



రాయగడ: సంబరాల్లో పాల్గొన్న తెలుగువారు



పర్లాకిమిడి: పట్టణంలో ఆటపాటలతో అలరిస్తున్న గిరిజనులు



రాయగడ: భోగి మంటల వద్ద పూజలు నిర్వహిస్తున్న స్థానికులు



బరంపురం: భోగి మంటలు వేస్తున్న ఫ్రెండ్స్ వెల్ఫేర్ క్లబ్ ప్రతినిధులు



బరంపురం: స్కిక్రమ్ కాలనీలో భోగి మంటలు వేస్తున్న తెలుగు ప్రజలు



పర్లాకిమిడి: మార్కెట్ వద్ద కొనుగోలుదారుల సందడి



జయపురం: శాస్త్రోక్తంగా కలపకు పూజిస్తున్న అర్చకులు



జయపురం: భోగీ మంటలకు పూజలు చేస్తున్న మహిళలు



కొరాపుట్: నవరంగ్‌పూర్ గదబగుడలో తెలుగు యువత సంబరాలు



కొరాపుట్: నందపూర్ వద్ద తెలుగు ప్రజల భోగి మంటలు

కటక్ మకర మేళాలో అపశృతి

- తొక్కిసలాటలో మహిళ మృతి, పలువురికి గాయాలు



గోపీనాథ్‌పూర్-బొడొంబా టీ వంతెన



భక్తజనంతో కిటకిటలాడిన వంతెన పరిసరాలు

కటక్: ఒడిశాలోని కటక్ జిల్లా గోపీనాథ్‌పూర్-బొడొంబా టీ వంతెనపై తొక్కిసలాట చోటు చేసుకుంది. అఠొగొడొ ప్రాంతం మహానది నదిలో ఉన్న సింఘనాథ్ ఆలయానికి అనుసంధానపరిచే ఈ వంతెన శనివారం భక్తులతో కిక్కిరిసిపోయింది. మకర సంక్రాంతి పురస్కరించుకుని ఈ ఆలయంలో జరిగే వార్షిక మేళాకు ప్రజలు తండోప తండాలుగా తరలి వస్తారు. ఈ సందర్భంగా తొక్కిసలాట చోటు చేసుకోగా, ఒకరు మృతిచెందారు. పలువురు గాయపడ్డారు. ఈ తొక్కిసలాటలో నలుగురు మహిళలు, ముగ్గురు చిన్నారులతో పాటు 12మంది గాయపడ్డారు. వీరిలో నలుగురి పరిస్థితి విషమించడంతో చికిత్స కోసం బొడొంబా ఆస్పత్రిలో చేర్చారు. 8మందిని ఉన్నత చికిత్స కోసం కటక్‌లోని ఎస్‌సీబీ మెడికల్ కాలేజీ ఆసుపత్రికి తరలించినట్లు కటక్ జిల్లా కలెక్టర్ భవానీశంకర్ చొయిని వెల్లడించారు. తొక్కిసలాటకు దారితీసిన పరిస్థితులపై ఆరా తీసేందుకు జిల్లా పోలీసు యంత్రాంగం విచారణ చేపడుతోందన్నారు. ఈ ఏడాది మకర మేళాకు రూ.2 లక్షల 50వేల మంది ప్రజలు తరలి వచ్చినట్లు అఠొగొడొ డిప్యూటీ కలెక్టర్ హేమంత్‌కుమార్ స్వైన్ తెలిపారు. వంతెనపై అకస్మాతుగా జనం తరలి రావడంతో ప్రమాదం జరిగిందని భావిస్తున్నారు. తొక్కిసలాట జరిగే సమయంలో దాదాపు 50,000మంది వంతెనపై ఉన్నారని అధికార వర్గాల అంచనా.

పరిహారం ప్రకటన

కటక్ జిల్లా గోపీనాథ్‌పూర్-బొడొంబా టీ వంతెనపై తొక్కిసలాటలో ఓ మహిళ మృతి చెందింది. ఆమె కుటుంబీకులకు ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ రూ.5 లక్షల పరిహారం ప్రకటించారు. ఈ ఘటనలో గాయపడిన వారికి ఉన్నత చికిత్స, వైద్య సదుపాయాలు ఉచితంగా కల్పించాలని ఆదేశించారు. మృతుల కుటుంబీకులకు రూ.20 వేలు, గాయపడిన వారికి రూ.10 వేల చొప్పున రెడ్‌క్రాస్ సహాయ నిధి నుంచి ఆర్థిక సాయం అందించనున్నట్లు కలెక్టర్ ప్రకటించారు.

రక్షణ కల్పించండి

- ఎస్పీని కోరిన మున్సిపల్ అటెండర్ భార్య..



ఎస్పీ కార్యాలయం వద్ద మీడియాతో మాట్లాడుతున్న లిల్లీ ప్రధాన్



మీడియాతో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ రాజేంద్రపాత్రొ

కొరాపుట్: జిల్లాలోని సునాబెడా మున్సిపాలిటీ చైర్మన్ డాక్టర్ రాజేంద్రకుమార్ పాత్రొ మరోసారి వివాదాల్లో చిక్కుకున్నారు. సిమిలిగుడ సరస్వతీ నగర్‌లో నివసిస్తున్న లిల్లీ ప్రధాన్ కొరాపుట్ ఎస్పీ కార్యాలయానికి చేరుకొని, తనకు రక్షణ కల్పించాలని కోరారు. ఈ మేరకు బరంపురానికి చెందిన మహిళా హక్కుల ఉద్యమ నాయకురాలు ప్రమీలా త్రిపాఠితో కలిసి కొరాపుట్ చేరుకున్నారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ తాను గత 30 ఏళ్లుగా సిమిలిగుడలోని సరస్వతి విద్యామందిర్ సమీపంలోని ప్రభుత్వ భూమిలో ఇల్లు కట్టుకొని నివసిస్తున్నట్లు తెలిపారు. విద్యామందిర్ కార్యదర్శిగా ఉన్న చైర్మన్ రాజేంద్రపాత్రొ తండ్రి ప్రకాశ్‌పాత్రొ తనను వేధిస్తున్నారని ఆరోపించారు. దీనిపై గతంలో తగాదాలు చోటు చేసుకున్నాయన్నారు. తన భర్త అజయ్ ప్రధాన్ అదే విద్యా మందిర్‌లో అటెండర్‌గా పని చేస్తున్నాడన్నారు. ఉద్దేశ పూర్వకంగా తన భర్తపై విధి నిర్వహణలో అవమానాలపాలు చేస్తున్నారని పేర్కొన్నారు. చివరకు కిరాయి వ్యక్తులను పంపి, తనపై భౌతిక దాడి చేశారని తెలిపారు. వారికి మద్దతుగా విద్యమందిర్ పని చేస్తున్న 11మంది అధ్యాపకులు మూకుమ్మడిగా దాడి చేసి గాయపరిచారన్నారు. అలాగే తన భర్తను విధుల నుంచి తొలిగించారని వాపోయారు. చివరకు తన ఇల్లు కూడా ఖాళీ చేయాలని బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికార పార్టీ బీజేడీ అండదండలతోనే నిందుతులు స్వేచ్ఛగా తిరుగుతున్నారని వాపోయారు. ఈ సమస్యపై చైర్మన్ రాజేంద్రపాత్రొ వివరణ ఇచ్చారు. లిల్లీ చేసిన ఆరోపణలు అవాస్తవమని కొట్టి పారేశారు.



బాల్య వివాహాల నియంత్రణపై ప్లకార్డులు ప్రదర్శిస్తున్న చిన్నారులు



ఉత్సవంలో పాల్గొన్న యువతులు



రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు

వైభవంగా రాహ్‌గిరి

మల్కన్‌గిరి: జిల్లా కేంద్రంలో మాల్యవంత్ మహోత్సవాల్లో భాగంగా శనివారం నిర్వహించిన రాహ్‌గిరి కార్యక్రమాలను కలెక్టర్ విశాల్‌సింగ్ జెండా ఊపి, ప్రారంభించారు. ప్రజల్లో చైతన్యం కలిగించడమే ఈ కర్యక్రమం నిర్వహించినట్లు ఆయన తెలిపారు. ఇందులో భాగంగా రోడ్డు ప్రమాదాలకు గల కారణాలు, నియంత్రణ, బాల్య వివాహాల రద్దు తదితర అంశాలపై విద్యార్థులు వివరించారు. అలాగే సంబల్‌పూర్ నృత్యం, చిన్నారుల స్కేటింగ్, ముగ్గులు, డ్యాన్స్ పోటీలు నిర్వహించారు. అలాగే పిల్లలతో కలిసి ప్లకార్డులు ప్రదర్శిస్తూ రోడ్ షో చేశారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ అక్షయకుమార్ ఖెముండు, అదనపు కలెక్టర్ మహేశ్వర్ చంద్రనాయక్, పురపాలక అధ్యక్షుడు మానోజ్ బారిక్, డీపీఆర్ ప్రమీలా మాఝి, ఇతర అధికార్లు పాల్గొన్నారు.

క్లుప్తంగా

18న రాజాం రోడ్డు విస్తరణ పనులు ప్రారంభం

- మంత్రి బొత్స సత్యనారాయణ చేతుల మీదుగా శ్రీకారం



రాజాం రోడ్డు విస్తరణ పనులపై మంత్రి బొత్సతో చర్చిస్తున్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు

రాజాం: రాజాంలో రెండో విడత రోడ్డు విస్తరణ పనులు ఈ నెల 18న విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ చేతుల మీదుగా ప్రారంభించేందుకు ఏర్పాట్లు పూర్తిచేశామని ఎమ్మెల్యే కంబాల జోగులు శనివారం తెలిపారు. విజయనగరంలో బొత్సను కలిసి ఆహ్వానం అందించామని, ఆయన పనులు ప్రారంభించేందుకు రాజాం వస్తారన్నారు. అంబేడ్కర్ కూడలి వద్ద ఫౌండేషన్ స్టోన్ ఏర్పాటు చేశామన్నారు. అంబేడ్కర్ కూడలి నుంచి జీఎంఆర్ఐటీ వరకూ, బొబ్బిలి కూడలి నుంచి గాయత్రికాలనీ వరకూ రోడ్డు విస్తరణ పనుల నిమిత్తం రూ.20 కోట్ల నిధులు మంజూరైనట్టు వెల్లడించారు. 80 అడుగుల మేర రోడ్డు విస్తరణతో పాటు అండర్ డ్రైనేజీ, ఫుట్‌పాత్ నిర్మాణం, మధ్యలో డివైడర్ల ఏర్పాటు తదితర పనులు సాగుతాయన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, పాలవలస మణికంఠ పాల్గొన్నారు.

ఆ గ్రామంలో కనుమ రోజు సంక్రాంతి



తమ్మయ్యవలస గ్రామం

తెర్లాం: మండలంలోని అన్ని గ్రామాల్లో సంక్రాంతి పండుగను ఆదివారం జరుపుకోనున్నప్పటికీ తమ్మయ్యవలస గ్రామంలో మాత్రం కనుమ పండుగ రోజున సంక్రాంతి పండుగను గ్రామస్తులు జరుపుకుంటారు. సంక్రాంతి పండుగను కనుమ పండుగ రోజున జరుపుకోవడం కొన్నేళ్లుగా గ్రామస్తులకు ఆనవాయితీగా వస్తోంది. అదే రోజున గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేస్తారు. రాష్ట్రమంతా సంక్రాంతి పండుగను భోగి పండుగ మరుసటి రోజున జరుపుకుంటే తాము మాత్రం కనుమ పండుగ రోజున జరుపుకుంటామని, అదే పద్ధతిని ప్రతీ ఏటా కొనసాగిస్తున్నామని గ్రామానికి చెందిన పలువురు అంటున్నారు.

కోళ్ల ఫారం దగ్ధం

పూసపాటిరేగ: మండలంలోని రాయుడుపేటలో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ వల్ల శనివారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో కోళ్లఫారం దగ్ధమైంది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన నమ్మి రమణకు చెందిన కోళ్ల ఫారంలో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా మంటలు వ్యాపించాయి. దీంతో సుమారు రెండు వేల కోడి పిల్లలు మృతి చెందినట్లు బాధితుడు చెప్పాడు.

పేకాటరాయుళ్ల అరెస్టు

గంట్యాడ: మండలంలోని నీలావతి గ్రామంలో కొంతమంది పేకాట ఆడుతున్నట్లు శుక్రవారం రాత్రి పోలీసులకు సమాచారం అందడంతో వారు పేకాట శిబిరంపై దాడిచేశారు. ఆరుగురు పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకుని, వారి వద్ద రూ.12,650లు నగదు స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై కె.కిరణ్‌కుమార్‌నాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రెండు బైక్‌లు ఢీ, నలుగురికి గాయాలు

దత్తిరాజేరు: మండలంలోని పెదమానాపురం మద్దలవాని చెరువు వద్ద శనివారం ఎదురుగా వస్తున్న రెండు బైక్‌లు ఒకదానికొకటి ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో నలుగురికి గాయాలయ్యాయి. పెదమానాపురం నుంచి మెంటాడ మండలం కొంపంగి గ్రామానికి కూనిబిల్లి ఈశ్వరరావు, సత్యం, సన్యాసినాయుడు బైక్‌పై వెళ్తుండగా.. ఇంగిలాపల్లి నుంచి ఎదురుగా బైక్‌పై వస్తున్న రమేష్ ఒకరినొకరు ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. స్థానికుల సమాచారంతో పెదమానాపురం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో గజపతినగరం సామాజిక ఆస్పత్రికి తరలించారు. అనంతరం ఈశ్వరరావు, సత్యం, సన్యాసినాయుడులను మెరుగైన వైద్యం కోసం విజయనగరం ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఎస్సై బి.భాగ్యం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వివాహిత ఆత్మహత్య

సంతకవిటి : మండలంలో మామిడిపల్లి గ్రామానికి చెందిన పైల శ్రీదేవి(30) అనే వివాహిత శనివారం మృతి చెందింది. సంతకవిటి పోలీసులు తెలిపిన వివరాలు... శ్రీదేవి ఈ నెల 13న పురుగుల మందు సేవించి ఆత్మహత్యకు పాల్పడింది. స్థానికులు 108 వాహనంలో శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స అందిస్తుండగా శనివారం మృతి చెందినట్టు తెలిపారు. శ్రీదేవి పొందూరు మండలం మునిసిపేట గ్రామానికి చెందిన వివాహిత. ఎనిమిదేళ్ల కిందట మామిడిపల్లి గ్రామానికి చెందిన పైల పోలారావుతో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్యాభర్తల మధ్య మనస్పర్థల నేపథ్యంలో భర్త పోలారావు కొట్టడంతోనే తన కుమార్తెకు ఈ పరిస్థితి ఏర్పడిందని మృతురాలి తల్లి పొందూరు లక్ష్మి ఆరోపించారు. సంతకవిటి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ జనార్దనరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.



సంప్రదాయ వస్త్రధారణలో తెలుగు ప్రతినిధుల నగర పరిక్రమణ



సంక్రాంతి ఉత్సవాల్లో మాట్లాడుతున్న ఎంపీ చంద్రశేఖర్ సాహు, పక్కన ఎమ్మెల్యే విక్రమ్, మేయర్ సంఘమిత్ర



ఆకట్టుకుంటున్న హరిదాసు కీర్తనలు

అంబరాన్నంటిన సంబరాలు

- తెలుగు లోగుళ్లలో ముందస్తు సంక్రాంతి సంబరాలు
- సంప్రదాయ వస్త్రధారణలో ఆకట్టుకున్న మహిళలు, పురుషులు

బరంపురం: నగరంలోని తెలుగు వారు ముందస్తుగా నిర్వహించిన సంక్రాంతి సంబరాలు అంబరాన్ని తాకాయి. బరంపురం ఆంధ్ర మహిళా సమాజం, ఆంధ్ర భాషాభివర్ధినీ సమాజం, తెలుగు సంఘాల సహకారంతో నగరంలోని కాపు వీధిలో ఉన్న ఆంధ్ర మహిళా సమాజం ప్రాంగణలో శనివారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. తెలుగు వారి సంప్రదాయాలకు అనుగుణంగా పచ్చని తోరణాలు, చెరుకు గడలు, అరటి గెలలతో పల్లె వాతావరణాన్ని తలపించేలా అలంకరణలు చేపట్టారు. అలాగే సంప్రదాయ వస్త్రధారణ, పంచెకట్టులో అంతా కార్యక్రమాలకు హాజరయ్యారు. ముఖ్య అతిథిగా హాజరైన బరంపురం ఎంపీ చంద్రశేఖర్ సాహు, ఎమ్మెల్యే విక్రమ్‌పండా, మేయర్ సంఘమిత్ర దొళాయి పాల్గొని, జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం బరంపురం తెలుగు మహిళలు చేపట్టిన కోలాటం, నృత్య గీతాలు, బృందగానం ఆహుతులను ఆకట్టుకున్నాయి. మోనింగి కామేశ్వర్ ప్రదర్శించిన హాస్య సన్నివేశం కడుపుబ్బా నవ్వించింది. అలాగే హరికథా సన్నివేశం, భరతనాట్యం అబ్బురపరిచాయి. కార్యక్రమంలో తెలుగు సంఘల ప్రతినిధులు పి.సత్యనారాయణబాబు, మోనింగి కామేశ్వరి, ఎం.వెంకటరమణ, టి.గోపి, కార్పొరేటర్లు, జమ్ముల శ్రీనివాస్, టి.కిశోర్‌పాత్రొ తదితరలు, తెలుగు సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

చైతన్య ఆంధ్ర సాహితీ సంస్కృతి సమితి ఆధ్వర్యంలో

పర్లాకిమిడి: భోగి, సంక్రాంతి పండుగ సందర్భంగా పట్టణంలోని సేరివీధి, నాయుడు వీధుల్లో చైతన్య ఆంధ్ర సాహితీ సంస్కృతి సమితి ఆధ్వర్యంలో రంగవల్లుల పోటీలు నిర్వహించారు. ఇందులో సేరి వీధిలోని పలువురు మహిళలు సంక్రాంతి గొబ్బెమ్మలు, హరిదాసు, గంగిరెద్దులతో కూడిన ముగ్గులు అందంగా తీర్చిదిద్దారు. న్యాయనిర్ణేతలుగా కోట్ని శోభారాణి, పి.లత, పి.రాజ్యలక్ష్మి, వైశ్యరాజు రాధిక, పొట్నూరు స్వప్న వ్యవహరించారు. విజేతలకు పబ్లిక్ ప్రాసిక్యూటర్ వీఎస్ఎస్ రాజు బహుమతులు అందజేశారు. వారికి పట్టుచీరలు, జ్ఞాపికలు పంపిణీ చేశారు. ప్రథమ స్థానంలో గొట్టిపల్లి హేమలత, సుచిత్ర మహంతి, కానుకలను అందజేశారు. కార్యక్రమంలో వేదంబట్ల వెంకటరమణమూర్తి, చైతన్య సమితి అధ్యక్షుడు బర్నాల జగన్నాథరావు, వీఎస్ఎస్ రాజు, జి.నానాజీ, పి.ప్రసాదరావు, ఈసై వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.



పర్లాకిమిడి: ఇంటి ముందు ముగ్గు వేస్తున్న మహిళ



పొంగలి వండుతున్న తెలుగు మహిళలు



భోగిమంట వెలిగిస్తున్న ఎంపీ చంద్రశేఖర్ సాహు



పర్లాకిమిడి: ముగ్గుల పోటీల్లో ప్రసంగిస్తున్న గంటా నానాజీ



పల్లెగూటికి పెద్దపండగ

భోగి మంటలు



భోగి పళ్లు పోసి పిల్లలకు ఆశీర్వాదం

- ఊరూరా సంక్రాంతి సందడి
- వైభవంగా భోగిపండగ
- ఇంటింటా కొత్త వేడుక



ఇళ్లముందు గొబ్బెమ్మలు



డూ..డూ.. బసవన్నలు

పార్వతీపురంటౌన్: రంగవల్లులతో తీర్చిదిద్దిన వీధులు.. గుమ్మడి పూల అలంకరణతో కొలువుదీరిన గొబ్బెమ్మలు.. ఆధ్యాత్మిక సౌరభాలు వెదజల్లుతూ హరిదారు కీర్తనలు.. డూడూ బసవన్నల విన్యాసాలు, పిండివంటల ఘుమఘుమలు.. నూతన వస్త్రాలు ధరించిన పిల్లల కేరింతలు.. ఊరంతా బంధుమిత్రుల సందళ్లు.. పండగకు వచ్చిన కొత్త అల్లుళ్లు... ఇంటికి చేరిన ధాన్యరాసులు.. అన్నదాతల ఆనందోత్సాహాలు... పల్లె ముంగిట గిలిగింతలు పెట్టే చలి మంటలు.. ఆలయాల్లో పులకింపజేసే ప్రవచనాలు.. దేవదేవుళ్లకు విశేష అభిషేకాలతో పల్లెగూటికి పెద్దపండగ వచ్చింది. ఊరూరా సంక్రాంతి సందడి నెలకుంది.

గొబ్బెమ్మ కొలువులు

పండగ నెల ప్రారంభమైనప్పటి నుంచి ప్రతి ఇంటి ముందు ఉదయాన్నే కల్లాపు చల్లి అందమైన ముగ్గులు వేసి వాటి మధ్యన గొబ్బెమ్మను పెట్టి పూజిస్తారు. తెలుగు సంప్రదాయం ప్రకారం గొబ్బెమ్మలను గోదాదేవి, లక్ష్మీదేవి, గౌరీ మాతగా భావిస్తారు. గోవు పేడతో చేసిన గొబ్బెమ్మలను ముగ్గులు మధ్యలో ఉంచి గుమ్మడి, పూలు, పసుపు కుంకుమ సమరి మంచి పూజిస్తారు. ధనుర్మాసం పొడవునా గొబ్బెమ్మను పూజించి సంక్రాంతికి దేవుళ్లకు ఆహ్వానం పలుకుతారు. ప్రతి ఇంటా సంక్రాంతి వెలుగులు ప్రసరించాలని ఆకాంక్షిస్తారు.

భోగిభాగ్యం

భోగి పండగ శనివారం ఊరూరా వైభవంగా సాగాయి. భోగిమంటల వేయడం వల్ల సకల దోషాలకు పరిహారం లభిస్తుందన్నది నమ్మకం. గోవు పేడతో చేసిన పిడకలతో వేసిన మంట ద్వారా వచ్చే పొగ పీల్చడం ఆరోగ్యానికి మంచిదని సైన్స్‌చెబుతోంది. అందుకే ఏటా వేకువనే చిన్నా పెద్దా కలిసి భోగి మంట వేసుకుని చలి కాచుకుంటూ పరమానందం పొందుతారు.

సంక్రాంతి.. పితృదేవతలకు శాంతి

మకర సంక్రాంతిని పెద్దల పండగగా పిలుస్తారు. ఆ రోజున పితృదేవతలకు కొత్త దుస్తులు చూపించి తర్పణాలు వదులుతారు. పంచభక్ష్య పరమాన్నాలతో కూడిన నైవేద్యం సమర్పించి పెద్దల ఆశీర్వచనం పొందుతారు. పేదలకు అన్నదానం చేసిన అనంతరం ఇంటిల్లపాది కలిసి భోజనం చేసి ఆనందిస్తారు.

పశువుల పండగ కనుమ..

కనుమను పశువుల పండగగా పిలుస్తారు. ఏడాది పొడవునా వ్యవసాయ పనుల్లో రైతులకు అండగా నిలిచే పశువులను ప్రత్యేకంగా పూజిస్తారు.



సంక్రాంతి ముగ్గులు

పందెంరాయుళ్ల అరెస్ట్

భోగాపురం: మండలంలోని ముడసర్లపేట గ్రామ శివారులో నీలగిరి తోటలో కోడిపందాలు నిర్వహిస్తున్న ఐదుగురు వ్యక్తులను శనివారం అరెస్ట్ చేసినట్లు ఎస్సై కృష్ణమూర్తి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామ సమీపంలో కోడిపందాలు నిర్వహిస్తున్నట్లు సమాచారం రావడంతో సిబ్బందితో కలిసి దాడి చేశామన్నారు. ఈ దాడిలో ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని.. వారి వద్ద నుంచి నాలుగు కోళ్లు, 64,270 రూపాయల నగదు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

పోలీసుల అదుపులో జూదరులు..

భోగాపురం: మండలంలోని గూడెపువలసలో నిర్వహిస్తున్న పేకాటశిబిరంపై పోలీసులు దాడి చేసి 14 మందిని అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద నుంచి రూ.2,90,110 నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై కృష్ణమూర్తి తెలిపారు.

జామిలో..

జామి: మండలంలో యాతపాలెం గ్రామం సమీపంలో నిర్వహిస్తున్న కోడి పందాల శిబిరంపై శనివారం సాయంత్రం పోలీసులు దాడి చేశారు. నలుగురు పందెంరాయుళ్లను అదుపులోకి తీసుకుని వారి నుంచి ఐదు కోడిపుంజులు, రూ.1100 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై వీరబాబు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

గాయపడిన వృద్ధురాలి మృతి

గంట్యాడ: అగ్ని ప్రమాదంలో గాయపడి ఓ వృద్ధురాలు మృతి చెందింది. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని రామవరం గ్రామంలో ఈ నెల 8వ తేదీన చుక్క సూరమ్మ అగ్ని ప్రమాదంలో గాయపడింది. తాను ఉంటున్న గుడిసెకు నిప్పు అంటుకోవడంతో మంటలు చెలరేగగా తీవ్రంగా గాయపడింది. దీంతో కుటుంబ సభ్యులు 108 అంబులెన్సు ద్వారా ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం కేజీహెచ్‌కు రిఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ ఐ కె.కిరణ్‌కుమార్ నాయుడు తెలిపారు.

- పండగ పూట పెరిగిన డిమాండ్
- సీతంపేట ఐటీడీఏ పరిధిలో 30 నాటుకోళ్ల పెంపకం కేంద్రాలు
- 200 మినీ కోళ్లషెడ్లు కేటాయింపు
- పీఎంఈజీఎస్ కింద నాటుకోళ్ల పెంపకానికి ప్రోత్సాహం

కాసులు కురిపిస్తున్న నాటుకోళ్లు

భామిని: మన్యంలో నాటుకోళ్ల పెంపకంతో గిరిజనులకు కాసులవర్షం కురుస్తోంది. పండపూట కోళ్లకు గిరాకీ పెరిగింది. ఇగురైనా.. పులుసైనా.. చివరకు ఫ్రై అయినా.. నాటు కోడి కూర రుచే వేరు. అందుకే.. మాంసం ప్రియులు నాటుకోడి కూరను రుచి చూస్తున్నారు. ఏజెన్సీలో ప్రతీ చికెన్ సెంటర్‌లోనూ నాటుకోడి మాంసం దొరుకుతుందంటూ కనిపిస్తున్న బోర్డులే దీనికి నిదర్శనం. ప్రస్తుతం నాటుకోడి కిలో రూ.300 నుంచి రూ.500 పలుకుతోంది.

నాటుకోళ్ల పెంపకంపై అవగాహన

పార్వతీపురం మన్యం జిల్లాలో నాటు కోళ్ల పెంపకం లాభసాటిగా ఉండడంతో జిల్లా పశుసంవర్థక శాఖ అధికారులు కోళ్ల ఫారాల ఏర్పాటును ప్రోత్సహిస్తున్నారు. కోళ్ల పెంపకంపై శిక్షణ ఇస్తున్నారు. ప్రధాన మంత్రి ఎంప్లాయ్‌మెంట్ గ్యారెంటీ స్కీమ్‌లో రుణసదుపాయం కల్పిస్తున్నారు. ఉపాధితో పాటు ఆరోగ్యం పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నారు.



నాటుకోళ్ల పెంపకం యూనిట్ నిర్వహణపై అవగాహన పొందుతున్న గిరిజనులు

సీతంపేట ఐటీడీఏ పరిధిలో వాస్సన్ స్వచ్ఛంద సంస్థ సైతం ప్రత్యేక షెడ్ల నిర్మాణం, పెరటి కోళ్ల పిల్లల పెంపకం, అంటువ్యాధులు ప్రబలకుండా వ్యాక్సిన్లు వేయించడం తదితర అంశాలపై గిరిజనులకు అవగాహన కల్పిస్తోంది. ఇప్పటికే మన్యం 30 భారీ నాటుకోళ్ల ఫారాలు ఏర్పాటుచేయగా, మరో 200 మినీకోళ్ల ఫార్మ్యాల ఏర్పాటుకు చర్యలు చేపట్టింది.

30 కోళ్ల యూనిట్లు మంజూరు



సీతంపేట ఐటీడీఏ పరిధిలోని గిరిజనులకు 30 నాటుకోళ్ల యూనిట్లు మంజూరు చేశాం. హెచ్‌డీఎఫ్‌సీ ఆర్థిక సహకారంతో యూనిట్లను విస్తరిస్తున్నాం. ఒక్కో యూనిట్‌కు రూ.లక్షా30 వేలు కేటాయించి, 50 కోడి పెట్టలు, 10 కోడి పుంజుల పెంపకాన్ని ప్రోత్సహిస్తున్నాం. ఆదివాసీ పిల్లల్లో రక్తహీనత గుర్తించి ప్రొటీన్స్ గల నాటుకోడి ఆహారం అందించడంతో పాటు ఆదాయం పెంచే చర్యలు చేపట్టాం.

– కల్యాణ్ పాత్రో, ప్రొగ్రామ్ మేనేజర్, వాస్సన్ సంస్థ, సీతంపేట

పీఎంఈజీఎస్‌లో...



నాటుకోడి మాంసంలో ప్రొటీన్స్ అధికం. రోగనిరోధక శక్తి ఎక్కువ. నాటుకోళ్లకు గిరాకీ ఉంది. అందుకే యూనిట్లను విరివిగా మంజూరు చేస్తున్నాం. ప్రధాన మంత్రి ఎంప్లాయ్‌మెంట్ గ్యారెంటీ స్కీమ్‌లో నాటుకోళ్ల ఫారంల నిర్వహణలో నిరుద్యోగ యువతను ప్రోత్సాహిస్తున్నాం. రాయితీపై రుణాలు మంజూరు చేస్తున్నాం.

– డాక్టర్ ఆరిక ఈశ్వరరావు, జేడీ, పశుసంవర్థక శాఖ, పార్వతీపురం మన్యం జిల్లా

కల్యాణ వైభోగం

ధనుర్మాసం ముగింపు సందర్భంగా గరుగుబిల్లి మండలం తోటపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం గోదాదేవి, రంగనాథస్వామి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు బీవీ అప్పలాచార్యులు వేదమంత్రాలతో స్వామివారి కల్యాణం జరిపారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

– గరుగుబిల్లి



ఉద్యాపన పూజలు

సీతానగరం మండలంలోని బళ్లకృష్ణాపురం, బగ్గందొరవలస, సీతానగరం గ్రామాల్లో నెల రోజులుగా గోవిందమాలలు ధరించి గోవింద నామస్మరణతో తిరువీధి చేసిన భక్తులు శనివారం సువర్ణముఖినదీ తీరంలో ఉద్యాపన పూజలు చేశారు. భోగిపండగ రోజున ఆలయ ప్రాంగణంలో పూజలు నిర్వహించి సువర్ణముఖ నదిలో ఉద్యాపన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆలయంలో శ్రీనివాస కల్యాణం జరిపారు.

– సీతానగరం



క్లుప్తంగా

యుద్ధవీరుడికి సత్కారం



ఆనందరావును సత్కరిస్తున్న గ్రామస్తులు

జి.సిగడాం: మండలంలోని ధవళపేటకు చెందిన విశ్రాంత యుద్ధ సైనికుడు బొడ్డేపల్లి ఆనందరావుకు శనివారం గ్రామస్తులు ఘనంగా సన్మానం చేశారు. 1968లో దేశ రక్షణ బాధ్యతలకు ముందడుగు వేసి యుద్ధంలో సేవలందించారు. గ్రామంలో సుమారు 190 మంది యువకులను సైనికులుగా చేర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేత పేడాడ శ్రీరామమూర్తి, కృష్ణంరాజు, సత్తిరాజు, స్వాతినాయుడు తదితరులు పాల్గొన్నారు.

శారీరక దృఢత్వంతో సంపూర్ణ ఆరోగ్యం



జిమ్‌పార్క్ ప్రారంభోత్సవంలో స్పీకర్ తమ్మినేని సీతారాం

ఆమదాలవలస: శారీరక దృఢత్వంతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. ఆమదాలవలస ప్రభుత్వ ఉన్నత పాఠశా ల, ప్రభుత్వ జూనియర్ కళాశాలల మైదానంలో సిక్కోలు చేయూత సేవా సంఘం ఆధ్వ ర్యంలో ఏర్పాటు చేసిన జిమ్‌పార్క్‌ను శనివారం స్పీకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అటు యువతకు, ఇటు చిన్నారులకు ఉపయోగపడేలా జిమ్‌పార్క్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన విభాగ ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవి నాగ్, పార్టీ మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ బి.రమేష్‌కుమార్, ఎ.ఉమామహేశ్వరరావు, నాయకులు పి.చిన్నారావు, కె.రామకృష్ణ, బోర చిన్నంనాయుడు, డి.శ్యామలరావు, సంఘ నాయకులు వడ్డాది గోపీకృష్ణ, వి.టి.నాయుడు, విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆదిత్యుని సన్నిధిలో హైకోర్టు న్యాయమూర్తి



జస్టిస్ రాజశేఖరరావుకు జ్ఞాపిక అందజేస్తున్న సూపరింటెండెంట్

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామిని ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ తర్లాడ రాజశేఖరరావు శనివారం దర్శించుకున్నారు. ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ, సూపరింటెండెంట్ కె.వెంకటేశ్వరరావులు పూర్ణకుంభ స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. అనివెట్టి మండపంలో వేదాశీర్వచనాలు అందజేశారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి జువైద్ అహ్మద్ మౌలా నా, ప్రోటోకాల్ జడ్జి కె.రాణి, తహసీల్దా ర్ వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.


పొట్టేళ్లకు భలే గిరాకీ



చింతాడ సంతలో పొట్టేళ్లు కొంటున్న చేస్తున్న కొనుగోలుదారులు

ఆమదాలవలస రూరల్/రూరల్: కనుమ పండగ నేపథ్యంలో పొట్టేళ్లు, నాటుకోళ్లకు గిరాకీ పెరిగింది. జిల్లాలో ప్రాముఖ్యత కలిగి న చింతాడ, బుడు మూరు సంతలు శనివారం కొనుగోలు, వ్యాపారులదారులతో కిటకిటలాడాయి. స్థానికులతో పాటు సుదూర ప్రాంతాల నుంచి తరలివచ్చి కొనుగోళ్లు చేశారు. 10 కిలోల బరువైన పొట్టేలు రూ.10 వేలు నుంచి రూ. 12 వేలు వరకు ధర పలికింది. నాటు పొట్టేళ్లతో పాటు కొండజాతికి చెందిన పొట్టేళ్లు కూడా అధిక ధరలకు అమ్ముడుపోయాయి. 20 నుంచి 30 కిలోల బరు వు ఉండే పొట్టేళ్లను కొనుగోలు చేసేందుకు పలువురు ఆసక్తి చూపారు. నాటుకోడి రూ.800 నుంచి రూ.1000 వరకు ధర పలికింది.

ఆరోగ్య పరిస్థితిపై ఆరా



వాహనచోదకుల వివరాలు నమోదు చేస్తున్న సిబ్బంది

కాశీబుగ్గ: పలాస మండలం లక్ష్మీపురం జాతీయ రహదారి టోల్ ప్లాజా వద్ద శనివారం వాహనచోదకులకు ఆరోగ్య తనిఖీలు చేపట్టారు. కేంద్ర ప్రభుత్వం ఆరోగ్య భద్రతా కార్యక్రమంలో భాగంగా మానవ ఆరోగ్య భద్రత మేనేజర్ అంకబాబు అధ్యక్షతన వాహనచోదకుల ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీసి వివరాలు నమోదు చేశారు. సిబ్బంది మల్లాపురెడ్డి సాయిరాం, ప్రదీప్, బషీర్, అభీత్ పాల్గొన్నారు.



సంతోషాల క్రాంతి.. సంక్రాంతి



శ్రీకాకుళంలో భోగి మంటలు

- పల్లెల్లో పొంగిపొర్లుతున్న పెద్దపండుగ సంతోషం

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

సంక్రాంతి సంబరం.. ఆనందాల అంబరం. సంప్రదాయాల సోయగం.. ఆటపాటల కోలాహలం.. పంటలు చేతికొచ్చే.. ఆర్థికంగా చేయూతనిచ్చే సందర్భం.. కొత్త బట్టల ఫెళఫెళలు.. పిల్లల కేరింతలు.. పచ్చదనం పరవళ్లు.. కుటుంబ సభ్యులంతా కలిసి కులాసాగా గడిపే అపూర్వ సంగమం. మూడు రోజుల ఈ మహా పండుగలో మొదటిదైన భోగిని సిక్కోలు వాసులు ఘనంగా జరుపుకున్నారు. అసలు పండుగ సంక్రాంతి కోసం ఉత్సాహంగా ఏర్పాట్లు పూర్తి చేసుకున్నారు. ఊరూవాడా సంక్రాంతి కళ సంతరించుకున్నాయి.

ఆధ్యాత్మిక శోభతో పల్లెలు

పండగ సందర్భంగా ఊరూవాడా సంప్రదాయ శోభతో కళకళలాడుతున్నాయి. ఇళ్ల వాకిళ్లు రంగ వల్లులతో నిండిపోయాయి. పిండివంటలతో ఘుమఘుమలాడుతున్నాయి. పూలు, మామిడాకులతో ఇంటి గుమ్మాలు అందంగా కనిపిస్తున్నాయి. కుమారులు, కుమార్తెలు, అల్లుళ్లు, కోడళ్లు, మనుమలు, మనమరాళ్ల రాకతో ఇళ్లు సందడిగా మారాయి.



జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ముగ్గుల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. వస్త్రదానాలు చేశారు. గంగిరెద్దులు, హరిదాసుల సందడి కనిపించింది.



శ్రీకాకుళం నగరంలో సంక్రాంతి శోభ

సిరుల కాంతులు

ఈ ఏడాది ప్రకృతి కరుణించింది. పంట బాగా పండింది. గతం కన్నా వరి దిగుబడి నాణ్యతగా, ఎక్కువగా వచ్చింది. గతంలో సాధారణంగా హెక్టార్‌కు 52 నుంచి 54 క్వింటాళ్ల దిగుబడి వచ్చేది. ఇప్పుడది 58 క్వింటాళ్లకు పైగా పంట పండింది. 1,53,060 హెక్టార్లలో 8,11,120 మెట్రిక్ టన్నుల దిగుబడి వచ్చినట్టు అధికారులు అంచనా వేశారు. ధాన్యం కొనుగోళ్లు కూడా శరవేగంగా జరుగుతున్నాయి. దళారుల ప్రమేయం దాదాపు తగ్గింది. ప్రభుత్వమే కొనుగోలు చేయడంతో గిట్టుబాటు ధర దక్కుతోంది. ప్రభుత్వం కూడా అనుకున్నదానికన్నా ముందు చెల్లింపులు చేయడంతో చేతికి డబ్బులొచ్చాయి. ప్రభుత్వం వివిధ సంక్షేమ పథకాల నగదును నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకి జమ చేస్తుండడంతో ప్రజలు సంతోషంగా ఉన్నారు.

ఘనంగా భోగీ..

భోగి పండుగను శనివారం వైభవంగా జరుపుకున్నారు. తెల్లవారుజామునే భోగి మంటలు వేశారు. పిల్లలపై భోగి పళ్లు పోసి శ్రీమన్నారాయణుడి దివ్యమైన ఆశీస్సులు పొందారు. నేడు సంక్రాంతి, రేపు కనుమ పండుగను కన్నుల పండువగా నిర్వహించుకోనున్నారు. సంక్రాంతికి ఇళ్లల్లో కొందరు బొమ్మల కొలువులు సిద్ధం చేశారు.



జలుమూరు: బసవన్నల సందడి



శ్రీకాకుళంలో చిన్నారులకు భోగి పళ్లు పోస్తూ..

అడవిపిల్లి దాడిలో ఐదు దూడలు మృతి

సోంపేట: మండలంలోని మామిడిపల్లి, గొల్లూరు పంచాయతీల్లో శనివారం రాత్రి అడవి పిల్లుల దాడిలో ఐదు దూడలు మృతి చెందాయి. గత కొద్దిరోజుల్లో అడవి జంతువుల దాడిలో మొత్తం 16 దూడలు మృతి చెందినట్లు బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల గ్రామంలో పలుచోట్ల సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. శుక్రవారం రాత్రి మరోసారి అడవి పిల్లులు మామిడిపల్లి గ్రామానికి చెందిన ఎ.ధర్మారావు, ఆర్.ప్రకాష్, కె.నరేంద్ర, గేదెల భాస్కరరావు తదితర రైతులకు చెందిన దూడలపై దాడి చేశాయి. సీసీ కెమేరాలు పరిశీలించగా చిరుత ఆకారంలో ఉండే అడవి పిల్లులుగా గుర్తించారు. ఈ సందర్భంగా సర్పంచ్ పాతిన శేషగిరి, ఎంపీటీసీ దున్న మాధవరావు మాట్లాడుతూ బాధిత రైతులను ఆదుకోవడంతో పాటు అటవీ జంతువుల బారి నుంచి పాడి పశువులను కాపాడాలని కోరారు.



సీసీ కెమెరాలకు చిక్కిన అడవి పిల్లి



గాయాలపాలైన ఆవు

రేపు మందసకు 'నారాయణుడు'

మందస: ఉద్దాన ప్రాంత ఆరాధ్యదైవం రట్టి వల్లభ నారాయణుడు ఈ నెల 16న మందస రానున్నాడు. రాజుల కాలం నుంచి ఆనవాయితీ వస్తున్న ఈ సంప్రదాయాన్ని నేటికీ కొనసాగిస్తున్నారు. ఉద్దానంలో భేతాళపురం పంచాయతీ రట్టి గ్రామంలోని స్వామి వారిని నడకదారిలో సుమారు 15 కిలోమీటర్ల దూరంలో ఉన్న మందస పట్టణానికి అంబుగాం–బొడ్లూరు, హరిపురం, బాలిగాం, డబారు, ఉమాగిరి మీదుగా స్వామివారిని తీసుకువస్తారు. దారి పొడవునా స్వామిని భక్తులు పూజిస్తారు.

నేస్తానికి గుమ్మడికాయ

ఎల్.ఎన్.పేట: కొండల్లో పోడు వ్యవసాయం చేస్తూ జీవనం సాగించే గిరిజనులు దిగువ ప్రాంతాల్లో ఉంటున్న ఇతర కులాల (తెగల) వారితో నేస్తరి కం (స్నేహం) చేస్తారు. సంక్రాంతి పండగతో పాటు దసరా, దీపావ ళి, ఉగాది వంటి పండగల సమయంలో గిరిజన సంప్రదాయ ప్రకా రం నేస్తం ఇంటికి వెళతారు. గిరిజనులు పోడు పంటగా పండించే రకరకాల పంటలను కొద్దికొద్ది గా తీసుకుని నేస్తం ఇంటికి పయనమవుతారు. భోగి రోజున ఉదయం నేస్తం ఇంటికి చేరుకుని సాయంత్రం వరకు ఉంటారు. ఆ సమయంలో గుమ్మడికా య, కర్రపెండ్లం, అరటి కాయలు, అరటి పళ్లు, కందికాయలు, కందులు, అరటి ఆకులను ప్రేమగా అప్పగిస్తారు. తమ గిరిజన నేస్తానికి దిగువ ప్రాంతంలోని వారు రకరకాల వంటలతో కొసరి కొసరి సంతృప్తిగా భోజనం పెట్టి కొత్త దుస్తులు, బియ్యం, పప్పులు, పిండి వంటలు, దారి ఖర్చులకు కొంత మొత్తం డబ్బులు అందిస్తారు. ఇలా సంతృప్తి పొందిన గిరిజన నేస్తం కుటుంబం పది కాలాల పాటు చల్లగా ఉండాలని దీవిస్తారు.



ఎల్.ఎన్.పేట: మురగడలోవ నుంచి నేస్తం ఇంటికి గుమ్మడికాయతో వెళుతున్న గిరిజన కుటుంబం

జిల్లాస్థాయి వాలీబాల్ పోటీల విజేత టెక్కలి

సోంపేట: మండలంలోని మామిడిపల్లి పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి వాలీబాల్ పోటీల్లో టెక్కలి ప్రథమ స్థానం సాధించినట్లు సంఘ అధ్యక్షుడు బొడ్డు సింహాచలం తెలిపారు. శుక్రవారం అర్ధరాత్రి వరకు జరిగిన ఈ పోటీల్లో విజేతలకు విశ్రాంత ఐఏఎస్ అధికారి లక్ష్మీనారాయణ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ద్వితీయ, తృతీయ, నాలుగో స్థానాలు వరుసగా మామిడిపల్లి, బాతుపురం, చాపరాయి కాలనీ జట్లు నిలిచాయి. విజేతలకు నగదుతో పాటు, జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో రామకృష్ణ చారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడు రెయ్యి కోదండ కృష్ణ, సర్పంచ్ పాతిన శేషగిరి, ఎంపీ టీసీ దున్న మాధవరావు, పూర్వవిద్యార్థి సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

త్రిమతాల సంగమం సంగమేశ్వరుని ఆలయం

- మూడు మతాల ఐక్యతకు వేదికగా సంగమయ్య కొండ
- ఏటా సంక్రాంతి నాడు జాతర
- వేలాదిగా హాజరుకానున్న జనం

ఆమదాలవలస రూరల్:

ఆమదాలవలస పట్టణానికి మూడు కిలోమీటర్ల దూరంలో కొండల మధ్య కొలువుదీరిన సంగమేశ్వర ఆలయం మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తోంది. సంగమయ్య కొండ, గోపకొండగా పిలిచే ఈ శిఖరంపై ఆలయం హిందూ, జైన, బౌద్ధ మతాలకు కేంద్ర స్థానమై ఉంది. ఇది 12వ శతాబ్దానికి చెందినదని 1982లో సర్వే చేసిన పురావస్తుశాఖ ప్రతినిధి జవహర్‌లాల్ పేర్కొన్నారు. జైన మతస్తులు బౌద్ధ మతస్తులు, తర్వాత శైవ మతస్తులు కొండను ఆశ్రయించి తమ మతాలను మరింత ప్రభావితం చేశారని చరిత్రకారులు చెబుతుంటారు. ఆలయానికి సంబంధించి మరింత పరిశీలన జరిపితే ఆసక్తికర విషయాలు వెలుగు చూస్తాయని స్థానికులు అంటున్నారు.




కొండపై సంగమేశ్వర ఆలయానికి చేరుకునే మెట్లు భాగం (ఇన్‌సెట్లో) సంగమయ్య కొండ గుహలోపల ఉన్న దిగంబర విగ్రహం

చరిత్ర చెబుతున్న సాక్ష్యాలు..

సంగమేశ్వర కొండ దిగువన గొల్లభామగా పిలిచే దేవతా స్త్రీ విగ్రహం ఉంటుంది. 164 మెట్లు ఎక్కి పైకి వెళితే కొండ నట్టినడుమ భాగంలో 25 అడుగుల లోపలికి గుహ కనిపిస్తుంది. ఇందులో ఆరు అడుగుల ఎత్తున్న పురుషాకృతి కలిగిన విగ్రహం, దానిముందు శివలింగం, నంది, దుర్గాదేవి, విఘ్నేశ్వర విగ్రహాలు ఉంటాయి. ఇవికాక ఆలయం ప్రవేశం వద్ద నంది విగ్రహం, కుడి పక్కన బౌద్ధ విగ్రహం, ఎడమవైపున పెద్ద బుద్ధుని విగ్రహం కనిపిస్తాయి. ఈ కొండపై 150 ఏళ్ల క్రితం చిన్న దేవాలయం, 111 ఏళ్ల క్రితం మెట్ల నిర్మాణాలు జరిగాయని పెద్దలు చెబుతుంటారు. కొండ దిగువ నుంచి చూసినట్లయితే కొండ మెట్లు, దేవాలయం సర్పాకారం పోలి ఉంటాయి. ఆలయానికి చేరువలో పెద్ద మర్రి చెట్టు, వేప చెట్లు ఉన్నాయి.

- సంగమయ్య కొండకు సంబంధించి రెండు కథలు వాడుకలో ఉన్నాయి. సంగమయ్య అనే వ్యక్తి కొండపై ఉన్న మర్రిచెట్టు కింద తపస్సు చేసుకుంటూ లింగాన్ని ప్రతిష్ఠించి పూజలు జరిపేవాడు. భుక్తి కోసం పరిసర గ్రామాల్లో భిక్షాటన జరిపేవాడు. సంగమయ్య ఇబ్బందులు చూసిన యాదవ యువతి అతనికి రోజూ అన్నం పెట్టేది. ఈ వ్యవహారం నచ్చని కొందరు.. ఆగంతుకులను వెంటబెట్టుకుని సంగమయ్యను చంపేందుకు సమాయత్తమవ్వడంతో ఆ సమయంలో పూజలో ఉన్న సంగమయ్య శివలింగాన్ని చేతపట్టుకుని కొండచుట్టూ తిరిగి తప్పించుకుని కొండగుట్ట నడుమున చేరబడి పోయాడని, దైవకృప వల్ల ఈ కొండ గుహగా చీలిపోయిందని ఓ కథ వాడుకలో ఉంది. ఆ గుహలోకి వెళ్తున్న దుండగులు సంగమయ్యను నిల్చున్న చోటే చంపేసి ఎడమ బొటన వేలు, మర్మావయవాలను కోశారని, సంగమయ్యను కాపాడేందుకు వచ్చిన యాదవ యువతిని కూడా చంపేశారని, ఆమె పతివ్రత కావడంతో కొండ దిగువన శిలావిగ్రహంగా మారిపోయిందని కథనం.
- మహ్మదీయుల మత దురహంకారానికి ఇక్కడి విగ్రహం పాడుబడి ఉండవచ్చునని చరిత్రకారులు భావిస్తున్నారు. బౌద్ధమతం వ్యాప్తి చెందిన కాలంలో ఈ కొండ బౌద్ధ భిక్షువులకు నిలయమై బుద్ధుని విగ్రహ స్థాపనకు అవకాశం ఏర్పడి ఉండవచ్చునని వేరొక కథ వాడుకలో ఉంది. ఇక్కడున్న విగ్రహం కర్నాటక రాష్ట్రం శ్రావణ బెళగొలలో ఉన్న గోమందేశ్వరుడైన బాహుబలి విగ్రహాన్ని పోలి ఉంటుంది. ఈ ఆలయానికి ఏడు ఎకరాల భూమి ఉన్నా ఆదాయం లేదు. కొండ చుట్టూ ముళ్లపొదలు ఉన్నందున సంగమయ్యకు దీప, ధూప నైవేద్యాలు కూడా అందని పరిస్థితి. ప్రభుత్వ పురావస్తుశాఖ పరిశీలన జరిపి దీని గొప్పతనాన్ని రికార్డుల్లో పేర్కొన్నా నేటికీ విగ్రహాల రక్షణకు చర్యలు గానీ, దీని ఉనికిని ప్రజలకు తెలిపే బోర్డులు ఏర్పాటు చేయకపోవడం ఆశ్చర్యకరం.



ఆలయం బయట ఉన్న బౌద్ధుని విగ్రహం



భక్తులు చిల్లర డబ్బులు వేసే పురాతన బావి

ఏటా సంక్రాంతి జాతరలు..

ఏటా రాష్ట్రంలో తొలి జాతర ఈ కొండ దిగువ ప్రాంతంలోనే జరుగుతుంది. సంక్రాంతి మొదలుకొని కనుమ, ముక్కనుమ రోజుల్లో మూడు రోజుల పాటు భారీగా జనం తరలివస్తారు. స్థానికులే కాకుండా ఇతర జిల్లాలు, ఒడిశా రాష్ట్రం నుంచి సుమారు 2 లక్షల మంది హాజరవుతారు. సంగమేశ్వర కొండ పైభాగంలో ఉన్న ఆలయం ఎడమ పక్కన ఓ బావి ఉంటుంది. ఈ బావిలో దేవాలయంకు వచ్చే ప్రతీ భక్తుడు చిల్లర డబ్బులు వేసి మొక్కులు తీర్చుకుంటారు. ఇలా చేస్తే కోర్కెలు నెరవేరుతాయని భక్తుల నమ్మకం.

• కమనీయం.. గోదారంగనాథుల కల్యాణం



శ్రీకూర్మనాథాలయంలో గోదాదేవి కల్యాణం దృశ్యం



వాసుదేవ పెరుమాళ్ ఆలయంలో మంగళసూత్రాన్ని భక్తులకు చూపిస్తున్న అర్చకులు



శ్రీకాకుళం పీఎన్ కాలనీలోని నారాయణ తిరుమలలో అష్టదళ పద్మం

మంగళవాయిద్యాలు.. వేదమంత్రాల సాక్షిగా గోదాదేవి, రంగనాథుల కల్యాణం శనివారం కనుల పండువగా జరిగింది. శ్రీకూర్మంలోని కూర్మనాథాలయం, మందసలోని వాసుదేవ పెరుమాళ్ స్వామి ఆలయాల్లో వేదపండితుల కల్యాణ మంత్రోచ్ఛారణల మధ్య రంగనాథుడు గోదాదేవికి మంగళ సూత్రధారణ చేయగా.. అశేషంగా తరలివచ్చిన భక్తులు కనులారా వీక్షించారు.

–గార/మందస/శ్రీకాకుళం కల్చరల్